గ్రేటర్‌లో అన్నిస్థానాల్లో విజయం సాధిస్తాం

అబిడ్స్, నవంబర్ 29 : అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని స్థానాల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా పేర్కొన్నారు. గ్రేటర్‌లోని గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ 35 వేల మెజార్టీతో విజయం సాధిస్తారన్నారు. నగరంలో అండర్ పాస్ బ్రిడ్జిలు, నూతన ఫ్లైఓవర్లు, సీఆర్ఎంపీల ద్వారా పలు నూతన రహదారుల నిర్మాణాలతో పాటు అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. దేశ, విదేశాలకు చెందిన కార్పొరేట్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని తెలిపారు. దీంతో అనేక మందికి ఉద్యోగావకాశాలు వచ్చాయని పేర్కొన్నారు.

కార్తికమాస వన భోజనాలు

ఆర్యవైశ్య సంఘం పురానాపూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వన భోజనాల వేడుకల్లో పాల్గొన్న ఆర్యవైశ్యులు

అబిడ్స్, నవంబర్ 29 : ప్రతియేటా ఆర్యవైశ్య సంఘం పురానాపూల్ కార్వాన్ ఆధ్వర్యంలో కార్తీకమాస వనభోజనాల వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని ప్రాజెక్టు కన్వీనర్ మాడిశెట్టి సదానందంగుప్తా, ప్రాజెక్టు చైర్మన్ యాద శ్రీనివాస్ గుప్తా అన్నారు. బుధవారం పెంజర్ల శ్రీఅనంతపద్మనాభ స్వామి దేవాలయ ఆవరణలో ఆర్యవైశ్య సంగం పురానాపూల్ కార్వాన్ ద్వారా కార్తిక వనభోజన కార్యక్రమం ఏర్పాటైంది. ప్రాజెక్టు కన్వీనర్ మాడిశెట్టి సదానందం గుప్తా మాట్లాడుతూ.. కార్తికమాసంలో వన భోజనాలతో సంఘం సంఘటితమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పురానాపూల్ కార్వాన్ అధ్యక్షులు గుండా సురేశ్ గుప్తా, ప్రధాన కార్యదర్శి జగిని యాదగిరి గుప్తా, కోశాధికారి చిగుళ్లపల్లి గోవింద్‌గుప్తా, అనంత పద్మనాభస్వామి దేవాలయం చైర్‌పర్సన్ అనితరెడ్డి, షాదర్‌నగర్ సరాపు రమేశ్, అతిథులు జాల్‌వాడి ధనుంజయ, కొండా రమేశ్, సభ్యులు మావూరి దామోదర్ రెడ్డి, కో – చైర్మన్లు ఆకారపు శ్రీనివాస్‌గుప్తా, మంచుకొండ శ్రీనివాస్ గుప్తా, కర్నాటి వెంకట్ రాజుగుప్తా, బచు భాస్కర్‌గుప్తా పాల్గొన్నారు.

అయ్యప్ప పడి పూజ

లంగర్‌హౌస్ డివిజన్ బాపూనగర్ మందులబస్తీలో ఉన్న స్తంభాల మైసమ్మ ఆలయంలో బుధవారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ జరిగింది. లంగర్‌హౌస్‌కు చెందిన సుశీల్‌కుమార్ గౌడ్, కృతార్త్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన పూజను గురుస్వాములు కారింగుల గోపీగౌడ్, దండోతికార్ సంతోష్‌కుమార్, శ్రీనివాస్ గౌడ్ చేశారు. పడి పాటతో పడిని వెలిగించి, హారతి అందించారు. పూజలో గురుస్వాములు సాయి, ఉదయ్, గంట స్వాములు జతిన్, సాంబ శివ, శ్లోక్, కత్తి స్వాములు హార్దిక్, తేజ, కన్నె స్వాములు శ్రీనివాస్, రాజశేఖర్ గౌడ్, అక్షుగౌడ్ పాల్గొన్నారు. **- మెహిదీపట్నం, నవంబర్ 29**

కార్వాన్ బరిలో 18 మంది

నేడు తమ అస్త్రాన్ని ప్రయోగించనున్న ఓటర్లు

కార్వాన్, నవంబర్29 : 2023 శాసన సభ ఎన్నికల నేపథ్యంలో కార్వాన్ నియోజకవర్గం నుంచి మొత్తం 18 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. ప్రధాన పార్టీలైన భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) అభ్యర్థిగా మిత్ర కృష్ణ, ఎంఐఎం నుంచి కౌసర్ మొహినుద్దీన్, కాంగ్రెస్(ఐఎన్‌సీ) నుంచి ఉస్మాన్ బిన్ మహమ్మద్ అల్ హజ్రీ, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నుంచి టి. అమర్ సింగ్‌లతో పాటు పలు ఇతర పార్టీల నాయకులు, స్వతంత్రులు తమ తమ నామినేషన్లు దాఖలు చేశారు. ఈ క్రమంలో అంతిమంగా ఈవీఎంలలో 18 మంది తమ పేర్లు దక్కించుకున్నారు. ఇందులో ప్రధాన పార్టీల అభ్యర్థులు కౌసర్ మొహినుద్దీన్ – ఏఐఎంఐఎం, మిత్రకృష్ణ – బీఆర్ఎస్, ఉస్మాన్ బిన్ మహమ్మద్ అల్ హజ్రీ– కాంగ్రెస్, టి. అమర్ సింగ్ – భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కాగా మిగిలిన వారిలో పలు పార్టీలకు చెందిన వారితో పాటు స్వతంత్రులు కార్వాన్ అసెంబ్లీ ఎన్నికల పోటీలో ఉన్నారు.

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోండి

అబిడ్స్, నవంబర్ 29 : అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా గోషామహల్ నియోజకవర్గంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు వీలుగా అధికారులు చర్యలు తీసుకోవడంతో పాటు బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం ఐదు గంటలకు ముగియనున్నది. గోషామహల్ నియోజకవర్గంలో 2,70,622 మొత్తం ఓటర్లు ఉండగా 1,41,348 పురుషులు, 1,29,245 మహిళలు, 229 థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. ఆయా ఓటర్లతో 109 ప్రాంతాల్లో 235 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికల నిర్వాహణ సందర్భంగా రిటర్నింగ్ అధికారి వి.విక్టర్ నేతృత్వంలో ఆయా పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, ఎన్నికల సామగ్రిని కోఠి మహిళా విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి అందజేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్‌ల ద్వారా ప్రతి పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులతో పాటు ఇద్దరు సిబ్బంది చొప్పున నలుగురు సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. నియోజకవర్గం ఎన్నికలకు గాను వేయి మంది సిబ్బంది విధులలో పాల్గొననున్నారు. నియోజకవర్గం 11 పోలీస్ స్టేషన్ల పరిధిలోకి వస్తుండడంతో మొత్తం పోలింగ్ కేంద్రాల్లో 56 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా అధికారులు గుర్తించారు. ఆయా పోలింగ్ కేంద్రాలపై మైక్రో అబ్జర్వర్లు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించనున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, హెల్ప్‌డెస్క్ సౌకర్యాలు కల్పించారు.

బస్సులలో ఈవీఎంలు, ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న అధికారులు

ఓటు రాజ్యాగం ఇచ్చిన హక్కు - వి. విక్టర్, గోషామహల్ రిటర్నింగ్ అధికారి

గోషామహల్ నియోజకవర్గంలో ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు గాను అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. నియోజకవర్గంలోని 235 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరుగనుండగా ఆయా పోలింగ్ కేంద్రాలకు చెందిన ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఈవీఎం, వీవీ ప్యాట్‌లను అంద జేసి పోలింగ్ కేంద్రాలకు తరలించాం. ఇప్పటికే ఓటర్ల స్లిప్‌లను తమ సిబ్బంది ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగే ఈ ఎన్నికల్లో రెండు వేల మంది సిబ్బంది పాల్గొంటున్నారు. వేయి మంది పోలీస్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశాం. సాయంత్రం పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలను కోఠిలోని మహిళా విశ్వ విద్యాలయం వద్ద స్ట్రాంగ్ రూంలో భద్ర పరుస్తాం. డిసెంబర్ 3 న పోలైన ఓట్లను వివిధ పార్టీల ఏజెంట్ల సమక్షంలో లెక్కింపు చేపట్టనున్నాం.

ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని ప్రిసైడింగ్ అధికారులకు అందజేస్తున్న అధికారులు

ఎన్నికలకు ప్రత్యేక బలగాలు..

గోషామహల్ నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు గాను పోలీస్ అధికారులు ప్రత్యేక బలగాలను రంగంలోకి దింపారు. నియోజకవర్గం నోడల్ అధికారిగా గోషామహల్ ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి బందోబస్తు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద పోలీస్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. పారా మిలిటరీ బలగాలు, వందలాది మంది పోలీస్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నట్లు నోడల్ అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు.

ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు

ఈవీఎంల తరలింపును పరిశీలిస్తున్న గోషామహల్ రిటర్నింగ్ అధికారి విక్టర్

నేడు ఓటు వేయనున్న ప్రముఖులు

● నందినగర్ జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో మంత్రి కేటీఆర్ ● పలు కేంద్రాల్లో సినీనటులు

బంజారాహిల్స్, నవంబర్ 29 : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గురువారం పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ బంజారాహిల్స్ నందినగర్‌లోని బూత్ నంబర్ 124లో ఉదయం 7 గంటలకు ఓటు హక్కు వినియోగించుకుంటారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్ సెరికల్చర్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బూత్ నంబర్ 162లో ఉదయం 9గంటలకు, జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ మాదాపూర్ రోడ్ నంబర్ 3లోని వెంకటేశ్వర ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఎస్ఆర్ నగర్‌లోని నారాయణ జూనియర్ కళాశాలలో ఉదయం 7.30 గంటలకు, ఎమ్మెల్సీ కవిత బంజారాహిల్స్ రోడ్ నంబర్ 14లోని డీఏవీ పబ్లిక్ స్కూల్‌లోని పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకుంటారు. అదేవిధంగా జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లోని బూత్ నంబర్ 165లో సినీనటులు మహేశ్‌బాబు, సమ్రత, మంచు మోహన్‌బాబు, మంచు విష్ణు, మనోజ్, బూత్ నంబర్ 164లో విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, శ్రీకాంత్ ఓట్లు వేస్తారు. ఎఫ్ఎన్‌సీసీ పోలింగ్ బూత్ నంబర్ 164లో రాఘవేంద్రరావు, జీవిత, రాజశేఖర్, బూత్ నంబర్ 160లో విశ్వక్‌సేన్, బూత్ నంబర్ 166లో దగ్గుపాటి రాణా, సురేశ్‌బాబు, జూబ్లీహిల్స్ క్లబ్‌లోని బూత్ నంబర్ 149లో చిరంజీవి, సురేఖ, రాంచరణ్, ఉపాసన, నితిన్, ఎంపీ, ఎమ్మెల్యే కాలనీలోని బూత్ నంబర్ 157లో రవితేజ, ఓబుల్‌రెడ్డి స్కూల్‌లోని బూత్ నంబర్150లో జూనియర్ ఎన్టీఆర్, బీఎస్ఎన్ఎల్ సెంటర్‌లోని పోలింగ్ బూత్ నంబర్ 153లో అల్లు అర్జున్, స్నేహా రెడ్డి, అల్లు అరవింద్, అల్లు శిరీష్, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లోని బూత్ నంబర్ 151లో అక్కినేని నాగార్జున, అమల, నాగచైతన్య, అఖిల్, మణికొండ హైస్కూల్‌లో ప్రభాస్, అనుష్క, వెంకటేశ్, బ్రహ్మానందం, షేక్‌పేట్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో రాజమౌళి, రమా రాజమౌళి, జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45లోని ఆర్థిక సహకార సంస్థలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో అల్లరి నరేశ్, యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ ప్రభుత్వ పాఠశాలలో తనికెళ్ల భరణి తదితరులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు.